# 'పులి వేషం'

చిదంబరంగారు పెద్దపులిలా అవులించేరు. బద్దకంగా వుంది. పనీ - పాటా లేదు. ఒళ్ళు వంచి కష్టపడలేరు. దర్జాగా ఓబండరాయి మీద కూర్చుని గాండ్రుమంటే ఏ దిక్కూమాలిన మృగమైనా బిక్కచచ్చిపోయి, బెదిరిపోయి దొరికిపోతుంది. అంతే, కడుపు నిండిపోతుంది. అలానే గడిచిపోయింది యిన్నాళ్ళూ.

ఇప్పుడో! సంపాదించాల్సిన అవసరంలేకపోయినప్పటికీ ముసలి పులిలా కాకపోయినా, పులివేషం వేసుకునయినా ఒంటి విరుపులు చూపించకపోతే తోచిచావదు.

దూరంగా డప్పులు లయబద్ధంగా విన్పిస్తున్నాయ్. మధ్యలో తురుర్రమని బిగిలిమ్రోత వినగానే ఒళ్ళు జలదరిస్తోంది. ఢముకు ఢమాఢం అన్న టాసాదెబ్బ విన్పిస్తూంటే ఎక్కడ లేని వీరావేశమూ వచ్చేసి కదం తొక్కేద్దామనిపిస్తోంది.

నమ్మకాలలోకెల్లా మూఢనమ్మకం ప్రమాద కరమైనట్టుగా గ్రామదేవత పండగల్లోకెల్లా విజయనగరం పైడితల్లెమ్మ పండగ ప్రమోదకరంగా అంతెత్తున జరుగుతుంది.

ఎక్కడో ఉత్తరదేశంలో ఉద్యోగం చేసుకుంటున్న కొడుకు శ్రీనివాసరావు, భార్యా పిల్లల్తో దసరా సెలవులకని

వస్తూ వస్తూ బావమరది సుబ్బారావుని పికప్ చేసుకుని మరీ దిగేడు. ఇంత పేరు పొందిన జాతరా, విజయనగర ప్రాభవమూ వాళ్ళకి చూపించాలని శ్రీనివాసరావూ, తన పలుకుబడిని చూపించవచ్చునని చిదంబరమూ అమ్మవారి పండక్కి వుండి పొమ్మన్నారు.

ఊళ్ళోకి వెళితే కన్నుల పండగ్గా అన్ని వేషాలూ చూడ వచ్చునని ఇప్పుడు అలా వెళ్ళేరు.

పండగ ముందు రోజుని తోలేళ్ళ సంబరం అంటారు. ఆ రోజునే అమ్మవారికి దణ్ణం పెట్టుకుని ఒంటినిండా పసుపు వార్నీషూ, ఆపైన ఎర్రటి చారలూ, చెయ్యెత్తుతోకా, తోకచివర రంగురంగు కాగితాలతో పెద్దబుట్ట.

లంకవీధి, సుంకరవీధి బుట్టపులుల కెంతో పేరు! అలాగే కొబ్బరికాయలవాళ్ళ నాగిన్ డేన్సూను. ఇవన్నీ ఎవరి ముంగిట్లో ముందుగా ఆడితే వాళ్ళకంత గౌరవం. అవునూ... నిన్ననగా తోడేళ్ళ పండగయితే ఇంతవరకూ ఒక్క పులి వేషమూ తన యింట్లోకి రాలేదేం!

డిపాజిట్‌తోపాటు ప్రిస్టేజీపోయిన రాజకీయ నాయకుడిలా ముఖం జేవురించుకు పోయింది చిదంబరంకి. ఒక్కసారిగా గొంతులో పుల్లగా త్రేన్పువచ్చినట్టయి వెన్వెంటనే గొంతంతా కారంగా మండింది. దాంతోపాటు కళ్ళలో నీళ్ళు సుళ్ళుతిరిగాయి. నోటో నీళ్ళు ఊరేయి.

తుప్పున ఉమ్మేసేడు. 'వస్తార్లే' అని బలవంతంగా నచ్చజెప్పుకున్నాడు. అప్పటికిగాని తృప్తిపడలేక పోయేడు.

అవును మరి.

ఆ వార్డునుండి మూడుసార్లు కౌన్సిలర్‌గా ఎన్నికయ్యేడు. ఛైర్మన్‌కి వెంట్రుకవాసిలోనూ, ఎమ్మెల్యే పదవికి జానెడు దూరంలోనూ వుండిపోయేడు.

కాకపోతే, అమ్మవారి పండగ రోజున....

ఉదయాన్నే అలా మెయిన్‌రోడ్డు వేపు వెళితే, అమ్మవారి కోవెల నుండి ఇటు రాతిమేడవరకూను, అటు బ్రాంచి కాలేజీదాటి దేవీ విలాస్ వరకూ వున్న క్యూల్లోంచి వచ్చే నమస్కారాలకి తలే విసిరేవాడా.... దారి అడ్డంచేసి కాళ్ళు పట్టేసుకుని కదల నివ్వని "దొంగ" లకి డబ్బులే ఇచ్చేవాడా.... స్పెషల్ బందో బస్తు కొచ్చిన పోలీసు, హోం గార్డుల గార్డ్ ఆఫ్ ఆనరీ అందు కునే వాడా....

తలచుకుంటే చెప్పరాని తన్మయత్వం ముంచెత్తింది. ఇందాక తన లోగిట్లోకి యింతవరకూ పులి వేషాలు రానందుకు తలెత్తిన అసంతృప్తి... ఇప్పుడీ మధురమైన ఆలోచనతో నిండిన సంతృప్తి కలగలసిపోయి పొడలు పొడలుగా పౌడరు రాసుకున్నట్టు ముఖమంతా వికారం పులుముకుంది.

అయినప్పటికీ ఈ ఆలోచనల్ని వదల్చుకోలేడు. ఆ రోజు సాయంత్రం అవుతూంటే —

సిరిమాను తిరిగే వేళకి కోట బురుజుమీద ప్రత్యేకంగా వేయించిన షామియానా క్రింద ఆ ఉత్సవాన్ని చూడానికి వచ్చిన రాజ కుటుంబంతో పాటు ధీటుగా కూర్చున్న తన మీద ఎన్ని వేల కళ్ళు పడ్డాయోనని, అట్నుంచి తిరిగి రాగానే తన భార్య దిష్టితీసి పారేస్తే తనెంతగా ముసిముసి నవ్వులు నవ్వుకునేవాడు!

భార్యతోపాటు పోయిన దర్జాలూ, హోదాలూ గుర్తు కొచ్చేయి. శ్రీమతి పోవడం తట్టుకోగలిగినంత బాధే గాని పదవులూ, పలుకుబళ్ళూ పోవడం మరణబాధ కాదూ?

వార్డు కౌన్సిలర్‌నుండి ఛైర్మన్‌గిరీకీ, ఎమ్మెల్యే పదవికీ ఎదగలేక పోవచ్చునుగాక. మార్కెటింగ్ కమిటీకో, కోపరేటివ్ బ్యాంకు డైరెక్టరుగానో, రోటరీ క్లబ్‌లోనో చిదంబరంకి ఏదో ఒక పదవి వుంటూ వచ్చింది.

పోరంబోకులకి సులువుగా దొరికే ఉద్యోగం ప్రజా నాయక పదవి అంటాడు శ్రీను. తనని ఎద్దేవా చేయడానికే అయినప్పటికీ బాధపడడు చిదంబరం. ఎంచేతనంటే ఆ పదవంటూ తనకి వుండబట్టే అతగాడు పెద్ద చదువులు చదవ గలిగేడు. పెద్దింటి సంబంధం చేసుకున్నాడు. పెద్ద ఉద్యోగం వెలగబెడుతున్నాడు.

"మన కర్మకాలి ప్రజాస్వామ్యానికి ఈగతి పట్టింది నాన్నా మనదేశంలో. దాన్నికూడా వ్యాపారంగానూ, ఉద్యోగం గానూ చేస్తున్నారు. అదింకా నయమే. ఇప్పుడిప్పుడది స్మగ్లింగు లోకి, బ్లాక్ మెయిలింగులోకి కూడా దిగుతున్నాది...." అన్నాడు ఇందాకిందాకనే శ్రీను.

అంతా అయోమయంగా కనిపించింది చిదంబరంకి.

"ఏవిట్రా నువ్వంటున్నదీ....?" అని అప్పటికి అడిగేడు.

"ఏవుంది నాన్నా....ఎమ్మెల్యేలనీ కౌన్సిలర్లనీ దొంగ వ్యాపారంలో కొనుక్కోవడం లేదూ....మరింక పదవి దొరికిన తర్వాత భయపెట్టో, లొసుగులు చూపించో పన్లు జరిపించుకోవడం లేదూ....ఇదేకదు నాన్నా ఇప్పటి నాయకులతత్వం..." అన్నాడు వెటకారంగా.

గొంతులో పుల్లగా తేన్పు, వెంటనే భగ్గున మండింది గొంతు.

"పాపా .. భావనా అల్లం వుందేమో అమ్మ నడుగమ్మా" అంటూ మనవరాలికి పురమాయించేడు.

సుబ్బడిముందు తనతో ఇలా వాదన పెంచుకోవడం... గొంతేకాదు ఒళ్లుకూడా మండింది.

"ఊఁ...సరే ! ఇంతకీ సుబ్బడేం చేస్తున్నట్టు... ఏంవోయ్...?" ముందు శ్రీనునే అడిగి సుబ్బడివేపు ప్రశ్నార్థకంగా ముఖం తిప్పేడు.

"ఏంలేదు. మున్సిపాలిటీలో ఏవో ట్రైపిస్టుపోస్టులు వచ్చే యట. మీ చేతిలో వుందని వాళ్ళమ్మా, నాన్నా మరీమరీ నీతో చెప్పమన్నారు" అన్నాడు శ్రీను.

అవకాశం తన కొచ్చింది.

"అవున్రా శ్రీనూ....ఇన్ని లెక్చర్లిచ్చేవు. మళ్ళీ రాజకీయ నాయకుడి కాళ్ళే పట్టుకుంటున్నావేంరా ...ఇప్పటికయినా ఒప్పుకుంటావా.... పెద్దపులి పెద్దపులేనని" అంటూ చిద్విలాసంగా ఓ చిరునవ్వు విసిరేడు చిదంబరం.

"అదే మనకు పట్టిన దుర్గతి నాన్నా. గొప్ప మేధావులే రాజకీయ నాయకుల ప్రభావంనుండి తప్పించుకోలేకపోతున్నారు. అంచేత ఎన్నికల సమయంలో ఎన్ని ట్రిక్కులు చూపి గద్దె ఎక్కుతాడో అవే ప్రయోగించి వాటిద్వారా పనులు జరిపించుకోవడంలో తప్పేంలేదు. ఈ సంగతి మనదేశంలో నిరక్షరాస్యుల కూ-డా తెలుసు. మరంచేత రాజకీయ నాయకుడు పెద్దపులేం కాదు పులివేషం, అంతే" ఉపన్యాసం జోరుగా సాగుతోంది.

కాని తేస్పుమీద తేన్పు. కారం కారంగా గొంతూ, గుండెమ్మట పైత్యం కామోసు.భావన అల్లం చప్పరిస్తే బాగుండును. ఇంట్లో లేదు. సాయంకాలం అలా వానపాముగారి షాపువైపు వెళితే కొనాలి.

"ఏం నాన్నా....ఏవంటావ్ ?" అంటున్నాడు శ్రీను.

"ఏమిట్రా ...సుబ్బడి సంగతేనా....చూద్దాంలే" అని అప్పటికి ఫుల్‌స్టాప్ పెట్టేయించేడు చిదంబరం.

సాయంత్రం కావస్తోంది. వీళ్ళంతా సంబరంలో వున్నారు. "సరే, సిరిమాను ఉత్సవం టయిమయ్యింది కాబట్టి తను కూడా అలా వెళ్ళాలి అనుకుని బద్దకంగా మరోసారి ఆవులించి లేచేడు చిదంబరం.

నాలుగ్గంటలు కాలేదింకా. సినిమాలో దేవుళ్ళ శిరస్సు వెనక గిరగిర తిరిగే వెల్తురు చక్రంలా ఎంతకాలంగానో వెలిగించుతూన్న దివాణం దేవుళ్ళ ప్రభని రెట్టింపు చేస్తూ కోట బురుజు వెనగ్గా సూర్యుడు ధగధగ మెరుస్తున్నాడు.

జనం. ఎక్కడా జనమే.వీధివీధిలోంచీ సందు సందులోంచీ తోలనవసరంలేని గొర్రెల్లా తోసుకుంటూ....రాసుకుంటూ. కుమ్ముకుంటూ....రాజరికానికి గుర్తుగా నిలిచిపోయిన నల్లని కోట చుట్టూ ఉరకలూ...పరుగులతో...

బొంకుల్దిబ్బవైపు వెళ్తూను...అట్నుంచిటు కోవెలవైపు వస్తూను ఈశాన్య బురుజు మీదున్న షామియానానీ, అందులోని రాజకుటుంబాన్నీ అబ్బురంగా చూస్తూ, నడుస్తూ...నడుస్తూ చూస్తూ..-

జనం, ఎక్కడా ఇసకవేస్తే రాలని జనం.

ఆడపిల్లకి పూలు చూస్తే ఎంత పరవశమో రాజకీయ నాయకుడికి జనాన్ని చూస్తే అంత పులకరింత!

"నాన్నా, తాతగారూ....తాతగారూ" అంటూ కేకలు వినిపించకపోతే అంత దూరానున్న శ్రీనునీ, కోడల్నీ, పాపనీ, సుబ్బణ్ణీ కూడా చూడకుండా మైమరచి వుండిపోయేవాడే.

శ్రీను!

అమ్మ శ్రీనూ....వట్టి పులివేషంగాడికింద జమ కట్టేస్తావూ? గాండ్రుమని గర్జిస్తే ఈ జనం పిల్లికూనల్లా ఎలా ఒదిగిపోతారో చూస్తావా..ఆవునవును తప్పక చూపించాలి నా తడాఖా..

అదిగో వాసుదేవరావు....అద్గద్గో....అర్రె....కేకేద్దామంటే పెద్దరాజభక్తుడ్లా ఆ షామియానాకేసి అంతంతలు కళ్ళు చేసుకు చూస్తాడేం?

"తాతగారూ....తాతగారూ అదేటండీ" అంటూ చెయ్యి పట్టుకు లాగుతోంది పాప.

''ఏమిటీ....'' అంటూ వాసుదేవరావుమీంచి దృష్టి మరల్చవలసి వచ్చింది.

సంబరం ప్రారంభమైంది....తెల్లటేనుగు - అట్టతో తొండంలా గొట్టంచేసి దానిమీద నల్లదుప్పటి కప్పేసి-ఓ బండి మీద వెళ్తోంది.

దాంతోపాటు నడిచిన దృష్టి అప్పారావు మీద ఆగింది. అతనివైపు ఆశగా చూసేడు చిదంబరం. ఒకడయినా తనంత తానుగా పలకరిస్తే బావుణ్ను. పోనీ తనే పిలిచేస్తే పోదూ. చెయ్యెత్తి నోరుతెరవబోయేడు. కాని ఆ అప్పారావు తెల్ల ఏనుగు వెనకాలే వస్తున్న అంజలి రథంకేసి చూస్తున్నాడు.

"ఎవర్నండీ పిలవబోయేరు ...?" అనడిగేడు సుబ్బారావు... అవసరమైతే పరిగెత్తుకెళ్ళి పిలుచుకొస్తానన్నట్టుగా.

"వాడా....నాలాగే మాజీ కౌన్సిలరు. అప్పట్లో నాలాగే కౌన్సిల్లో ఒక వూపు వూపేసేడు... సర్లే....ఈ జనంలో ఏం పిలుస్తాం" అన్నాడు చిదంబరం.

"తాతగారూ....తాతగారూ..." అంటూ అటువేపు చూపింది పాప.

ఒక బండిమీద పొడవుగా చెక్కిన మానుని సీలకి బిగించేరు. దాని చివరన కుర్చీలా చెక్క అమర్చి వుంది. దానిమీద ఆలయ పూజారి ఓ విసనకర్ర పట్టుకు్కూర్చున్నాడు. ఆ సిరి మానుని అమ్మవారి ప్రతిరూపంగా భావిసారు జనం.

చిదంబరం అలవోకగా కళ్ళు మూసుకుని తెరిచేడు.

"పాపా....సిరిమానుకి దణ్ణం పెట్టమ్మా...." అన్నాడు భక్తితో.

"ఎందుకూ ?" అన్న మూడక్షరాలకి ఏంజవాబు చెప్పాలో తెలియక అటు చూస్తే శ్రీను నవ్వుతున్నాడు.

చిదంబరం ముఖం ఎర్రగా కందగడ్డలా చేసుకున్నాడు.

కానీ వెంటనే తామరపువ్వులా వికసించింది పరంధామయ్యని చూడగానే. అతను ప్రస్తుతం మున్సిపల్ కౌన్సిలర్. పక్కనుండే వెళ్ళిపోతూంటే "ఎంత పెద్దవాడివయితే మాత్రం... మమ్మల్ని కాస్త చూడకపోతే ఎలాగా" అన్నాడు చిదంబరం.

ఓ నవ్వు నవ్వి ఆగేడు పరంధామయ్య "ఏవిటీ..." అంటూ.

"మరేం లేదూ. కొడుకూ,కోడలూ వచ్చేరోయ్ పండక్కి. అదిగో ఆ కుర్రాడేమో మావాడి బావమరిది" అంటూ సుబ్బడికేసి కన్ను కలిపేడు చిదంబరం... అది గ్రహించినట్టుగా రెండడుగులు ముందుకువేసి "నమస్కారమండీ" అని వినయంగా చేతులు జోడించేడు సుబ్బారావు.

"ఎమ్మే చదూకున్నాడు....బుద్ధిమంతుడు....మనవంటే మంచి అభిమానమూ, గౌరవమూను" అన్నాడు.

"ఏవిటీ....ఏద్దైనా పెళ్ళి సంబంధమా ?" అంటూ నవ్వేడు పరంధామయ్య.

"జోకులకేం గాని....పెళ్ళి చెయ్యాలంటే చేతిలో పని వుండాలి కదా. ఆ పనిమీదే వచ్చేడు. మనాఫీసులో ఏవో

టైపిస్టు పోస్టులు ఖాళీ వచ్చేయట కదా'' నసుగుతూ అటు చూస్తే సుబ్బడు కళ్ళల్లో చిక్కుకున్నాడు. "ఆ విషయంలో నువ్వు సాయం చెయ్యాలి" అంటూ కాస్త తీవిగా గొంతు సలికించేడు చిదంబరం.

సర్రున కోపం పడగ విప్పినట్టు ముఖమే చెపుతోంది. ''కౌన్సిలర్ గిరీ తప్పిపోయినా నీకు ఇంకా ఎక్కడేది మాటా డాలో తెలిసినట్టు లేదు'' అన్నాడు పరంధామయ్య విసుగ్గా.

పుల్లగా....కారంగా....గొంతులో మంట. దిగమింగు కున్నాడు చిదంబరం తేన్పుని.

"సరే. మళ్ళీ కలుస్తాలే" అంటూ ఓ ఎర్ర నవ్వు నవ్వేసి వీళ్ళవైపు వచ్చేడు చిదంబరం.

'ఏం పర్వాలేదు సుబ్బడూ' అనబోయిన చిదంబరానికి...

శ్రీను మొఖమ్మీద సన్నగా ఉదయించి అంతటా పాకిన నవ్వు....

"నిన్నటినుండీ జుణాయించి గెంతింది పులివేషం. పండగ ముగిసే వేళకి చూడక్కా ఎలా వేలాడి పోతూందో" అంటున్న సుబ్బడి వెటకారం మాటలూ....

చూసీ....వినీ....

పుల్లగా తేన్పు....కారంగా....భగ్గుమంటూ తేన్పు.

"అన్నట్టు తాతగారూ....ఇందాక నాన్నగారు, భావన అల్లం కొన్నారు, ఇవ్వనాండీ" అంటోంది పాప. ★